ప్రజాశక్తి

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

కేంద్ర బడ్జెట్‌లో...

విశాఖకు నిరాశే

- రైల్వే జోన్‌కు నిధుల్లేవు
- మెట్రో సంగతి అంతే
- విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3295 కోట్ల కేటాయింపులు నిర్వహణ వ్యయాలే!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన దేశ బడ్జెట్‌లో విశాఖ జిల్లాకు మొండిచెయ్యి చూపించారు. సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ విశాఖలో ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు ఈ బడ్జెట్‌లో నిర్దిష్టంగా కేటాయింపులు చేయలేదు. మెట్రో రైల్ సంగతి ఇంకా మరచిపోవాల్సిందే అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఐదేళ్ల ప్రాజెక్టుకు నిర్దిష్టంగా నిధుల్లేవు. దేశంలోని 15 మెట్రో రైళ్ల ప్రాజెక్టులకు సుమారు రూ.31,106కోట్లు మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ (మహువా) అండర్‌లో మెట్రో రైళ్ల ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. దీంట్లో విశాఖ, విజయవాడ మెట్రోలకు ఎంత వచ్చిందన్నది చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే చాలా మెట్రో రైళ్లు ఆపరేషన్‌లోకి రానివాటి మౌలిక వసతుల కోసం ఉత్తరాదికి కేటాయింపులు అధికంగా ఈ బడ్జెట్‌లో ఉండే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

పోర్టు, స్టీల్‌ప్లాంట్‌లకు నిధులు...

విశాఖ పోర్టు అథారిటీ (విపిఎ)కు ఈ బడ్జెట్‌లో రూ.730 కోట్లు చూపించారు. బడ్జెట్‌లో ఇవ్వడం అంటే ఖర్చుకు ప్రొవిజన్స్ మాత్రమే డబ్బులు ఇవ్వరన్నది అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్‌గా వారి కార్యకలాపాల నిర్వహణకు అవసరమయ్యే వ్యయానికి అనుమతులుగానే బడ్జెట్‌లో కేటాయింపులను చూడాలని చెబుతున్నారు. అదే విధంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు బడ్జెట్‌లో రూ.3295కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇది కూడా అంతే. ఇదివరకే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యాలు, ప్రణాళికలకు అనుగుణంగా బడ్జెట్ ప్రొవిజన్ వీరికి లభిస్తుంది. ఈ రకంగా చూసినప్పుడు ఆయిల్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు బడ్జెట్‌లో చూపించడం పరిపాటి. హెచ్‌పిసిఎల్‌కు ఈ రకంగానే పొందుపరిచారు. విశాఖకు సంబంధించి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు కేటాయించాల్సి ఉంది. మెట్రో రైలు కూడా ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. నిర్దిష్టంగా వీటికి కేటాయింపులను చేయలేదన్నది తెలుస్తోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేకించి కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులేమీ కేటాయించినట్లు వెల్లడి కాలేదు.

నత్తనడకన గృహ నిర్మాణాలు

- ప్రారంభం కాని ఇళ్లు 17,612
- సగం కూడా పూర్తికాని దుస్థితి

గొలుగొండలో మధ్యలో నిలిపేసిన ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా గృహ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం నినాదంగా ఉంది. ఇంటి నిర్మాణ వ్యయానికి తగినట్లు యూనిట్ విలువ పెంచి చెల్లించకపోవడం, సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ఆపసోపాలుపడుతున్నారు. మంజూరైన ఇళ్ల డబ్బులు నిర్మాణానికి సరిపోక అప్పులపాలవుతున్నారు. స్తోమతలేని లబ్ధిదారులు సగం వరకు నిర్మించి మధ్యలో నిలిపివేస్తున్నారు. దీంతో నిర్మాణ లక్ష్యాలు ముందుకుసాగడంలేదు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఎంత ఒత్తిడి తెచ్చినా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నారు.

నియోజకవర్గాల వారీగా మంజూరు, పూర్తయిన ఇళ్లు

నియోజకవర్గం	మంజూరు	పూర్తయినవి	శాతం
పెందుర్తి	3,206	1818	57
అనకాపల్లి	11,880	4,689	39
యలమంచిలి	7,611	3,866	51
నర్సీపట్నం	9,453	4,575	48
చోడవరం	8,445	4,170	49
పాయకరావుపేట	14,427	5,521	38
మాడుగుల	10,793	4,271	40

జిల్లాలో గత ప్రభుత్వంలో పేదలకు మంజూరైన 65,800 ఇళ్లలో సగమైనా ఇప్పటికీ పూర్తవలేదు. ఇళ్ల నిర్మాణాలకు మంజూరుచేసిన దాదాపు రూ.1018 కోట్లలో రూ.632 కోట్లు ఖర్చయింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ కింద 57,122 ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద 8,678 ఇళ్లు మొత్తం 65,800 మంజూరయ్యాయి. వీటిలో 28,910 ఇళ్ల నిర్మాణాలు (44 శాతం) పూర్తయినట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు 17,612 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. 19,278 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలతో ఇల్లు నిర్మించుకోలేని కొంతమంది పేదలు నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారికి బిల్లులు సక్రమంగా ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆసక్తి చూపడంలేదు.

గత ప్రభుత్వంలో వలె, కూటమి ప్రభుత్వంలోనూ ఇళ్ల నిర్మాణాలు మందకొడిగానే ఉన్నాయి. జిల్లాలోని పెందుర్తి, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, మాడుగుల నియోజకవర్గాల్లో

మిగతా 2లో..

బ్రాండిక్స్‌లో 1, 3 యూనిట్ల కార్మికుల సమ్మె

వార్త మెయిన్‌లో..

వేర్వేరు చోట్ల 282 కిలోల గంజాయి పట్టివేత

వార్త మెయిన్‌లో..

రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లు కొనసాగించాలి

వార్త 8లో..

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

వార్త 3లో..

వాల్తేరు రైల్వే డివిజన్‌కు 6 బెస్ట్ ఎఫిషియెన్సీ అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఇసిఒఆర్) తన ఉద్యోగుల సేవలు, అంకితభావాన్ని గౌరవిస్తూ భువనేశ్వర్‌లో నిర్వహించిన విశిష్ట రైల్ సేవా పురస్కార్ -2024 వేడుకల్లో వాల్తేరు రైల్వే డివిజన్ వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు 6 బెస్ట్ ఎఫిషియెన్సీ షీల్డ్స్‌ను గెలుచుకుంది. వాల్తేరు డివిజన్‌లోని కమర్షియల్ బ్రాంచ్, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీ బ్రాంచ్, స్టోర్స్ డిపో, ట్రాక్ మెషిన్ డిపో, మెడికల్ బ్రాంచ్‌లకు బెస్ట్ ఎఫిషియెన్సీ షీల్డులు లభించాయి. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహూ బ్రాంచ్ అధికారులతో కలిసి షీల్డ్‌లను అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వాల్తేరు డివిజన్‌కు చెందిన 16 మంది రైల్వే అధికారులకు విశిష్ట రైలు సేవా పురస్కారం లభించింది. వీరికి పురస్కారాలను ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షులు కవితా ఫంక్వాల్, అదనపు జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహెరా, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బికె.మిశ్రా డిప్యూటీ జనరల్ మేనేజర్ కెకె.ఖదంగా ఇసిఒఆర్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ ఎఫిషియెన్సీ అవార్డులతో వాల్తేర్ డిఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ తదితరులు

'ఉక్కు'పై నిజాలు దాచేస్తున్నారా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'చెప్పింది చెయ్యరు... చేసేదేమిటో చెప్పరు'.. ఇదే సర్వసాధారణంగా ఎప్పుడైనా, ఎక్కడైనా పాలకుల మాటల్లో వ్యక్తం అయ్యే సారం. ప్రతి విషయం వెనుక పెద్ద తతంగాన్నే నడిపిస్తుంటారు. అన్నీ ప్రజల కోసమే ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తుంటారు. ఆచరణలో దేశంలోని కార్పొరేట్లు, పెట్టుబడిదారుల సేవలో మునిగి తేలుతుంటారు. నాలుగేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ చేయడానికి వీల్లేదంటూ పోరాడుతున్న కార్మికవర్గం డిమాండ్‌ను పెడచెవిన పెడుతూ ప్యాకేజీల పేరుతో హైడ్రామాను కూటమి పాలకులు మొదలుపెట్టారు. సొంత గనులు కేటాయిస్తే ఒక్కపైసా కూడా కేంద్రం ఇవ్వాల్సిన పనిలేదు. కానీ దేశంలోని గనులన్నిటినీ ప్రైవేట్ మిట్టల్, అదానీల కోసం దాచేస్తూ ప్రభుత్వ రంగ ఉక్కు ఫ్యాక్టరీ 'మూతి' కట్టేసి బిజెపి చోద్యం చూస్తుంటే రాష్ట్రంలోని టిడిపి, జనసేన తందానా అంటున్నాయి.

ప్యాకేజీతో ప్లాంట్ మనుగడ సాధ్యమేనా?

విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంలోని బిజెపి సర్కారు తాజాగా కేటాయించిన రూ.11,440కోట్లతో అన్ని సమస్యలు పరిష్కారం అయిపోతాయని, భవిష్యత్తులో ఏ సమస్యా రాదన్న రీతిలో తమ మీడియా ద్వారా ప్రచారం సాగిస్తున్నారు.

దానికి రాష్ట్రంలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి వంతపాడుతున్నాయి. 2021 జనవరి 27న కేంద్ర క్యాబినెట్ సబ్ కమిటీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్లు ప్రకటించిన సంగతిని చూస్తే గతంలో డిసిఐ విషయంలో మోడీ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించగా పోరాడి దీన్ని నిలుపుకున్నారు. రైల్వేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులను కేంద్రం పరాధీనం పాలు చేసేదిశగా 3వ సారి దేశంలో అధికారంలోకి వచ్చాక చకచకా పనులను ఆచరణలో పెడుతోంది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాత్రం గడచిన 4 ఏళ్లుగా కార్మికవర్గం తిరగబడుతూ వస్తోంది. ఉత్తరాంధ్ర, యావత్ ఎపి మొత్తం ప్రజానీకం ఉక్కు ఊపిరి తీయొద్దంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో కేంద్రం ఇరకాటంలో పడిందనే చెప్పాలి. ఐతే తాజాగా స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి మాత్రం మొట్టమొదటసారిగా మోడీ తన డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని స్టీల్‌ప్లాంట్ విషయంలో వెనక్కి తీసుకున్నట్లు చెప్పారు. దీన్ని నమ్మేంత తెలివి తక్కువ జనం కాదు ఇక్కడి కార్మికవర్గం అన్నది బిజెపి కాషాయ పాలకులకు ఇప్పటికే వారి పోరాట కొనసాగింపును చూస్తే

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నత్తనడకన గృహ నిర్మాణాలు

మంజూరైన 65,800 ఇళ్లకు 28,910 పూర్తయ్యాయి. హోం మంత్రి వంగలపూడి అనితకు చెందిన పాయకరావుపేట నియోజకవర్గం ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడింది. పెందుర్తిలో అత్యధికంగా 57 శాతం ఇళ్ల నిర్మాణాలు జరగ్గా, అత్యల్పంగా పాయకరావుపేటలో 38 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 4,568 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. వివిధ స్థాయిలో ఉన్న 19,278 ఇళ్లల్లో బేస్‌మెంట్‌లోపు 3,666, బేస్‌మెంట్ స్థాయిలో 10,040, రూఫ్ లెవల్‌లో 2,792, రూఫ్ కాస్ట్‌లో 2,780 ఉన్నాయి.

'ఉక్కు'పై నిజాలు దాచేస్తున్నారా?

అర్థమైఉండాలి.

ఎర వేసి తన వ్యూహం అమలుకు యత్నాలు...

నిజంగానే కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ నుంచి వెనక్కి వెళితే.. కేబినెట్ నిర్ణయంగా బయటకు రావాలి. కానీ అలాంటిదేమీ లేదు. ఇటీవల విశాఖలోని ఎయు గ్రౌండ్స్‌లో జరిగిన సాక్షాత్తూ మోడీ పాల్గొన్న సభలోనైనా ప్రకటన చేయాలి. ఇదీ జరగలేదు. ఆ తర్వాత మాత్రం రూ.11,440కోట్లు ప్యాకేజీ అకస్మాత్తుగా ఇచ్చేశారు. దీన్ని రాష్ట్రంలోని కూటమి పాలకులు తమకు అనుకూలంగా మలచుకొని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌ల ప్రయత్నాలతో ఇది సాధ్యపడిందన్నట్లుగా అన్వయించేసుకొని సంబరాలు జరుపుకున్నారు. దీని వెనుక స్టీల్‌ప్లాంట్ సంపద అయిన 22వేల ఎకరాల స్టీల్‌ప్లాంట్ భూములపై కార్పొరేట్లు కన్నేస్తే వారి సైగలకనుగుణంగా పాలకులు ముందుకు సాగుతున్నారు. వైజాగ్ స్టీల్ ఆస్తులు సుమారు రూ.3లక్షల కోట్ల పైమాటే. ఈ నేపథ్యంలో కార్మికుల పోరాటం సాగకుండా ప్యాకేజీ డ్రామాను రక్తికట్టిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సొంత గనులు కేటాయించే విత్తశుద్ధి, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే పని జరిగిందా? పోనీ పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఢిల్లీ పెద్ద 'మోడీ' పై వాటిలో ఏదో ఒక అంశంపై ప్రకటన చేయడానికి ఆటంకమేమిటి? అని ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మొదట దశలో మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్ పాండర్స్ అమర్చనున్నట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రములో చేపల వేట చేస్తున్నపుడు బోటు స్థానాన్ని గుర్తించేందుకు, సమాచారం తెలుసుకొనుటకు భద్రత, రక్షణ అవసరాల దృష్ట్యా 100 శాతం సబ్సిడీపై మత్స్యశాఖ సరఫరా చేస్తున్నదన్నారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో 586 మెకనైజ్డ్ బోట్లకు ఇంతవరకు ట్రాన్స్ పాండర్స్ అమర్చినట్లు తెలిపారు. మిగతా మెకనైజ్డ్ బోట్ల యజమానులు కూడా బోటు ఫిషింగ్ హార్బర్‌కు వచ్చిన వెంటనే విశాఖపట్నం మత్స్య శాఖ అభివృద్ధి అధికారికి తెలియజేస్తే ట్రాన్స్‌పాండర్స్‌ను అమర్చుతారని పేర్కొన్నారు. 100 కు పైగా బోట్లు ఇంకా అమర్చలేదని, ట్రాన్స్ పాండర్స్‌ను అమర్చుకోని బోట్లు చేపల వేటకు వినియోగించడం లేదని భావించి రిజిస్ట్రేషన్ రద్దు అవుతాయని తెలిపారు. ఈ నెల 7వ తేదీ లోపు ట్రాన్స్ పాండర్స్ అమర్చుటకు సహకరించాలని కోరారు.

ఘనంగా ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాసరావు జయంతిని పాత నగరంలోని శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ద్రోణంరాజు శ్రీనివాసరావు చిత్రపటానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ద్రోణంరాజు శ్రీనివాసరావు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పిఎస్ఎన్ రాజు, బెహరా భాస్కరరావు, బిపిన్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎన్నిక షెడ్యూల్ నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం ఉండదని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంవిపి కాలనీ : వివిఎంఆర్‌డిఎలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ఈ నెల 3వ తేదీన ఉండదని, తిరిగి మార్చి 10వ తేదీన ప్రజాదర్బార్ ఉంటుందని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్‌కు హెచ్‌పిఐ అవార్డు

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ వున్న

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఇండియా) ఎహెచ్‌పిఐ నుంచి పేటెంట్ సెంట్రిక్ ఆర్గనైజేషన్ విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డు లభించిందని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వున్న తెలిపారు. మేఫెయిర్ హోటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏటా హెచ్‌పిఐ, ఆరోగ్య సంరక్షణ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న సంస్థలను గుర్తించి ఇటువంటి అవార్డులను ప్రధానం చేస్తారని తెలిపారు. దీని లక్ష్యం భారతదేశ ఆరోగ్య వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడం, రోగి భద్రత, సేవ ప్రమాణాలను మెరుగుపరచడం ఈ అవార్డు ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. రోగి కేంద్రిత వైద్య సేవలు, వినూత్న వైద్య విధానాలు, అత్యున్నతమైన వైద్య ప్రమాణాలకు ఇది మద్దతుగా నిలుస్తుందన్నారు. మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ ఎల్లప్పుడూ సమగ్ర కేన్సర్ చికిత్సను అందించడంలో ముందంజలో ఉన్నదన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన సానుభూతి సేవలను అందిస్తూ, రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ గుర్తింపు లభించడం తమకు మరింత ప్రేరణ అందిస్తుందన్నారు. ప్రపంచస్థాయి కేన్సర్ చికిత్సను అందించడమే కాకుండా నివారణ, ఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఈ అవార్డు మరింత ఉత్సాహ పరుస్తుందన్నారు. 20 సంవత్సరాలుగా కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో తమ హాస్పిటల్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అత్యాధునిక చికిత్సలు, ఆధునిక పరిశోధన, రోగి-కేంద్రిత వైఖరితో కేన్సర్ చికిత్సలో ప్రామాణికంగా నిలుస్తోందని చెప్పారు. ఈ అవార్డు ప్రపంచ కేన్సర్ దినోత్సవం-2025 థీమ్‌కు అనుగుణంగా మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ కృషికి మరింత విలువను చేకూరుస్తోందని పేర్కొన్నారు.

తాజాగా నిర్వహించిన జాతీయ సర్వేలో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి కేన్సర్ ఆసుపత్రిగా తమ హాస్పిటల్ నిలిచిందని తెలిపారు. ఈ సర్వేలో దక్షిణ భారతదేశంలో 12వ స్థానాన్ని, దేశవ్యాప్తంగా 23వ స్థానాన్ని పొందడం గర్వకారణంగా ఉందన్నారు.

ఆర్‌టిసి సర్వీసుల నాణ్యత పెంచాలి

డైరీని ఆవిష్కరిస్తున్న విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశం ప్రకారం ఎపిఎస్ ఆర్‌టిసి సర్వీసుల నాణ్యత, భద్రత పెంచాలని, బస్సు స్టేషన్ టాయిలెట్ శుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, కూర్చోవడానికి బెంచీలు, ఫ్యాన్లు ప్రతి బస్సు స్టేషన్‌లో తప్పకుండా ఏర్పాటు చేయాలని, బస్సుల కండిషన్ మెరుగుపరిచి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సంస్థ సూపర్‌వైజర్లను విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు ఆదేశించారు. ఎపిఎస్ఆర్‌టిసి సూపర్‌వైజర్స్ అసోసియేషన్ డైరీని జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడవద్దన్నారు. గవర్నమెంట్ సర్వీసెస్, ఎపిఎస్ఆర్‌టిసి సేవలను వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా పొందవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా బస్ స్టేషన్ల ఫీడ్ బ్యాక్ ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని సరిదిద్దే ప్రయత్నం చేసి ప్రయాణికుల సేవలు మెరుగుపరచాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ విశాఖపట్నంలో భాగంగా బస్సు స్టేషన్లను, డిపోలను మరింత శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్లు జి.శ్రీధర్, యర్రంరాజు, మాధురి, నాయుడు, ఉజ్వల, హిమబిందు, అప్పారావు, నాయుడు, మోహనరావు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మహా కుంభమేళాకు యాత్రికులు, భక్తుల అదనపు రద్దీని తొలగించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08588 విశాఖపట్నం-గోరఖ్‌పూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 4వ తేదీ రాత్రి 10:20 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి గురువారం రాత్రి 19.30 గంటలకు గోరఖ్ పూర్ చేరుకుంటుంది. 08587 గోరఖ్ పూర్ - విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 7వ తేదీన సాయంత్రం 17.45 గంటలకు గోరక్‌పూర్‌లో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 15.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఛత్రాపూర్, బలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, నరాజ్ మార్థాపూర్, ధెంకనాల్, అంగుల్, బోయిండా, రాయిఖోల్, సంబల్పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్, రాయగఢ్, చంపా, బిలాస్పూర్, పెండ్రా రోడ్, అనుప్పూర్, షాడోల్, ఉమారియా, కట్నీ, మైహర్, సత్నా, మాణిక్పూర్, ప్రయాగ్‌రాజ్ ఛోకి, మీరజ్పూర్, చునార్, వారణాసి, జౌన్పూర్, షెనిహార్, మౌ, డియోరియా సదర్ మీదుగా ప్రయాణిస్తాయని, ఈ ప్రత్యేక రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 7 నెలల్లో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు వచ్చిన పెట్టుబడులకు గతంలోనే తాము ఒప్పందాలు చేసుకున్నామని వైసిపి నాయకులు చెప్పడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. గత ఐదేళ్లలో వైసిపి ఏమి సాధించిందని ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వైసిపి దోచుకోవడానికి ఉపయోగించిందని ఆరోపించారు. వైసిపి పాలన వల్ల ఏపి అభివృద్ధి 15 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి వైసిపి నెట్టేసిందన్నారు. వైసిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. కూటమి ప్రభుత్వం కృషితో స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ ప్యాకేజీ ప్రకటించిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన వైద్య విధానాలపై అవగాహన

ఆర్థో వైద్యుల సదస్సులో డాక్టర్లు శివశంకర్, రాజశేఖరన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రస్తుత సమాజంలో ప్రజల ఆర్థో విభాగ సమస్యలు పరిష్కరించేందుకు నూతన వైద్య విధానాలతో పాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం వినియోగించి సకాలంలో మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అందించే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థో రంగ వైద్య నిపుణులు డాక్టర్ శివశంకర్ అన్నారు. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యాన ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు (ఒసాప్కాన్-2025) మూడో రోజు నగరంలోని వివిఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరీనాలో నిర్వహించారు. దీనిలో భాగంగా ఆర్థో వైద్యులు డాక్టర్ జి.నరసింహారెడ్డి స్మారకార్థం సోలాపూర్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ కీలక ఎముకల వైద్య విభాగానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య సేవలు, తదితర అంశాలపై ఉపన్యాసం చేశారు. మరో ఆర్థో వైద్యనిపుణులు యగ్నేశ్వరుడు స్మారకార్థం డాక్టర్ రాజశేఖరన్ నూతన వైద్య విధానాలను ఉపయోగించి ఏ విధంగా ఆర్థో సమస్యలను పరిష్కరించవచ్చో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థో సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే అంశాలతో పాటు, విప్లవాత్మకమైన మార్పులు, తదితర అంశాలపై పిజీ విద్యార్థులు, వైద్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు గోల్డ్ మెడల్ పేపర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్.లోకనాథ్, డాక్టర్లు వర్మ, వివికె, రమేష్ సేన్, విజయ్, అశోక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: ANAKAPALLI
O.S.324/2023

Between:
Sri Adari Prasad ...Plaintiff
And:
Sanamanda John Cold Sastry ...Defendant

SUMMONS

To, The Defendant:
Sanamanda John Cold Sastry,
S/o. Sanamanda Eliya,
R/at D.No.26-14-18/16,
RMR Road, Near Head Post Office,
Town Kotha Road,
Visakhapatnam-530001.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs on the strength of promissory note and the suit stands posted to **20-02-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **20-02-2025 at 10:30 A.M** in the above mentioned Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
BUDDHA SRINIVASA RAO
YALLA SUDHA BABU,
Advocates,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE CUM SPECIAL JUDGE FOR SC/ST CASES AT: VISAKHAPATNAM
O.S.165/2016

Between:
Karanam Srinivasa Rao & 2 others ...Plaintiffs
And:
Sri Karanam Nookaraju & others ...Defendants

SUMMONS

To,
D-6: Sri Billapati Kumar Raja, S/o. late Rama Rao, Hindu, Aged about 45 years, Business, R/at Nunaparthi Village, Paravada Mandal, Anakapalli District.
D-7: Sri Billapati Ramu, S/o. late Rama Rao, Hindu, Aged about 40 years, Business, R/at Rest-do-
D-8: Sri Billapati Shivaji, S/o. late Rama Rao, Hindu, Aged about 38 years, Medical Representative, R/at Rest-do-
D-9: Smt. Jangala Sita, W/o. Ramakoti, Hindu, Aged 50 years, Housewife, R/at Desapatrunipalem Village, Paravada Mandal, Anakapalli District
D-10: Billapati Prabhavathi, D/o. late Rama Rao, Hindu, Aged 47 years, R/at Nunaparthi Village, Paravada Mandal, Anakapalli District.

Please take notice that the above named plaintiff has instituted the above suit against all of you for partition of the plaint schedule properties and other reliefs and the matter stands posted to **27-02-2025** for all of your appearance. Therefore, all of you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-02-2025 at 10:30 A.M** in the above mentioned Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
G. SATYANARAYANA,
Advocate
Visakhapatnam. **Cell: 63018 37676.**

వివాహితకు న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి -తగరపువలస :వివాహిత యామినికి న్యాయం చేయాలని భీమిలి మండలం, టి నగరపాలెం, గొల్లలపాలెం గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఆందోళన చేశారు. శనివారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. కుమార్తె కాపురం కుదుట పడలేదన్న బెంగతో వివాహిత యామిని తండ్రి బొట్టా శ్రీనివాసరావు (53) నెల రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో యామినికి న్యాయం చేయాలని, శ్రీనివాసరావు మృతికి బాధ్యులైన సంగివలసకు చెందిన చంద్రశేఖర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆందోళన కా రులు డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ వద్ద ఉన్న నాలుగేళ్ల కుమారుడిని యామినికి అప్పగించాలని కోరారు . సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ సుధాకర్ ఆందోళన విరమించాలని గ్రామస్తులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు.చంద్ర శేఖర్ ముందస్తు బెయిల్ తెచ్చుకోవడంతో తామేమీ జోక్యం చేసుకోలేమని సిఐ బదులిచ్చారు. నాలుగేళ్ల కుమారుడిని తల్లి యామిని వద్దకు చేర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆందోళనకు మద్దతుగా మాజీ సర్పంచ్‌లు పల్లా వెంకటరావు, పొట్నూరు రాము, స్థానికులు పల్లా సన్యాసిరావు పాల్గొన్నారు

జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గొల్లలపాలెం గ్రామస్తులు

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లు

ప్రజాశక్తి- వేపగుంట : గోపాలపట్నం ఆసుపత్రిలో క్షయవ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టిబి ముక్త్ పంచతిలో భాగంగా శనివారం పోషకాహార కిట్లను ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సి హెచ్.కనకరావు అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ జి.వెంకటరమణ, వానపల్లి శ్రీనివాసరావు ,టిబి హెచ్‌వి ఎస్‌జి.కరుణ ,కె.వెంకట్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయరూ?

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడలో అగ్నిమాపక కేంద్ర ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. జివిఎంసి రెండో జోన్ పరిధిలో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే, చాలా దూరాన ఉన్న సూర్యాబాగ్ నుంచి, లేదా తగరపువలస నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సి వస్తోంది. విశాఖ నగరంలో ప్రస్తుతం నెలకొన్న ట్రాఫిక్, సిగ్నల్ పాయింట్లన్నీ దాటుకుని అగ్నిమాపక వాహనం ఇక్కడికి చేరుకునే సరికి జరగాల్సిన నష్టమంతా జరిగిపోయే పరిస్థితి ఉంది. విశాఖ మహానగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఎండాడ, మధురవాడ, కొమ్మాది, పోతిన మల్లయ్య పాలెం ఉన్నాయి. ఇక్కడ మూడు లక్షలకుపైనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో చిన్న పెద్ద తరహా కంపెనీలతో పాటు పలు ఐటీ కంపెనీలు, వాణిజ్యసముదాయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు, మల్టీ మార్కెట్ సంస్థలు, ఆసుపత్రులు ఉన్నాయి. అపార్ట్‌మెంట్ కల్చర్ ఇక్కడ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం తీవ్రంగానే ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. జాతీయ రహదారిపై హనుమంతువాక నుంచి బోయపాలెం మధ్యలో ఇటీవల పలు వాహనాలు దగ్ధమైన ఘటనలు చోటుచేసుకున్నాయి. సకాలంలో అగ్నిమాపక వాహనం చేరుకోకపోవడంతో తీవ్రనష్టమే జరిగింది. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకొని జివిఎంసి రెండవ జోన్ పరిధిలోఅగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

శ్రీసాయి ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో చోరీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో గల శ్రీసాయి ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ తుంపాల ఝాన్సీ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనవరి 31న శుక్రవారం రాత్రి కంపెనీలో వెనక భాగంలో తలుపులు విరగగొట్టి దొంగలు లోపలకు చొరబడి కంపెనీకి సంబంధించిన కటింగ్ మిషన్స్, వీల్స్, ఎలక్ట్రికల్ కేబుల్స్, వైర్లు, కంపెనీ మెషినరీని చోరీ చేసినట్లు, వాటి విలువల రూ.5 లక్షలు ఉంటుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సిఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కవల్లి: మండలములోని చినదొడ్డిగల్లు శివారు ప్రాంతంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్నిబాబు తెలిపారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 6,100 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని ఎస్ఎస్ దాబా వద్ద అనుమానస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుండి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బుచ్చయ్యపేట ఎస్సై ఏ.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టుకు చెందిన చంద్రసేన్, పెదబయలుకు చెందిన గోపాలరావు పల్సర్ బైక్‌పై వచ్చి ఎస్ఎస్ దాబా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా 6 కేజీల గంజాయి పట్టుబడినట్లు చెప్పారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి, ఒక పల్సర్ బైక్‌ను, గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు.

వ్యభిచారం కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. వ్యభిచారం చేస్తున్న ఒక మహిళను, ఒక విటుడిని, నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, పాతపట్నానికి చెందిన ఎస్.సంతోష్ కుమార్ మద్దిలపాలెం ఆటోమోటివ్ జంక్షన్ దగ్గర ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సంతోష్ కుమార్, విటుడు పెందుర్తి, చినముషిడివాడకు చెందిన పి.రోహిణికుమార్, కాకినాడకు చెందిన యువతిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ఎంవిపి పోలీసులకు అప్పగించారు.

ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : వినియోగదారులను వేధింపులకు గురిచేస్తున్న కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్‌ల ఆగడాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, కొనుగోలు శక్తి లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో గృహోపకరాలు, ఇతర వస్తువుల కొనుగోలుకు ప్రజలు ప్రయివేటు ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారని, సకాలంలో ఇఎంఐలు చెల్లించలేని స్థితిలో ఫైనాన్స్ సంస్థల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. నామమాత్రపు డౌన్ పేమెంట్‌తో బైకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇస్తామని నమ్మబలికి, తర్వాత వేధింపులకు పాల్పడే ప్రయివేటుఫైనాన్స్ సంస్థలపై పోలీసులు, అధికారులు నిఘాపెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు సమావేశంలో మాలమహానాడు ఉత్తరాంధ్ర అధ్యక్షులు మామిడి వెంకట శివ, జిల్లా అధ్యక్షులు కె ఈశ్వర వీర కుమార్, నియోజక వర్గ అధ్యక్షులు బోని సన్నిబాబు, ఆనందపురం మండల అధ్యక్షులు సియ్యద్రి రాంబాబు

చౌకబారు ఆరోపణలు మానుకోవాలి : ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజాశక్తి- సీతమ్మధార : తనపై అవాస్తవ, చౌకబారు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలకు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం సీతంపేటలోని జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీకి కార్యకర్తలు లేని సమయంలో తాను ఆస్తులను అమ్ముకుని, కోట్లు ఖర్చుపెట్టి, వైసిపి బలోపేతానికి కృషిచేశానని, తీరా అధికారంలోకి వచ్చాక తన రాజకీయ భవిష్యత్‌ను ఆపార్టీ సమాధి చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనను పిలిచి, రాజకీయ పునరుజ్జీవం కల్పించారన్నారు. తాను పబ్‌లు, లిక్కర్ దుకాణాలు, ఫుడ్‌కోర్టుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు అసత్య ఆరోపణలు చేసిన వారిపైనా,ఆయా కథనాలను ప్రచురించిన పత్రికలపైనా న్యాయసహాయాన్ని ఆశ్రయిస్తానన్నారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోవడంతోపాటు రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిన వైసిపిని చిత్తుగా ఓడించి ప్రజలు బుద్ధి చెప్పినా, వారి గుణం మారలేదని ఎద్దేవా చేశారు.

సినీ ఫక్కీలో చోరీ : నిందితురాలి అరెస్టు

ప్రజాశక్తి -కొత్తకోట: ఆటోలో వెళ్తున్న వృద్ధురాలిని ఏమార్చి సినీ ఫక్కీలో రూ. లక్ష నగదును కాజేసిన మహిళను 24 గంటలు గడవకుండానే కొత్తకోట పోలీసులు అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు. దీనికి సంబంధించి కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాలివి. దొండపూడికి చెందిన గంపా సత్యవతి శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంకులో తన ఖాతాలోంచి రూ. లక్ష నగదును డ్రాచేసి బ్యాగులో పెట్టుకొని నక్కపల్లి మండలం ఉద్దండపురంలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు దొండపూడిలో ఆటో ఎక్కింది. ఆ ఆటోలో అప్పటికే గుర్తు తెలియని మహిళ ఉంది. బొడ్డేపల్లి వెళ్లేందుకు వృద్ధురాలు ఆటో ఎక్కగా రోలుగుంట మండలం నిండుగొండ జంక్షన్ వెళ్లే సరికి అర్జెంట్ పని ఉందని ఆటో డ్రైవర్‌తో చెప్పి వృద్ధురాలిని దింపించింది. అదే ఆటోలో ఆమె వెళ్లి పోయింది. అనుమానం వచ్చి వృద్ధురాలు బ్యాగును తెరిచి చూడగా దాంట్లోని రూ.లక్ష నగదు కనిపించలేదు. బ్యాగును బ్లేడుతో కోసి దాంట్లోని నగదును తస్కరించి పట్టుకు పోయినట్లు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు. నగదు చోరీపై వృద్ధురాలి ఫిర్యాదు మేరకు బృందాలుగా గాలించిన పోలీసులు, వి.మాడుగులకు చెందిన మహిళ నగదును చోరీ చేసినట్లు గుర్తించి, శనివారం ఆమెను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అప్పగించారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లోనూ, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు విలువైన వస్తువులు, నగదు ఉంటే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీనగర్‌లో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లాకు చెందిన గంట్యాడ భాస్కరరావు (30) ఫార్మాసిటీలోని లాజరస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ శ్రీనగర్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన భాస్కరరావు ఇంటి యజమాని మనవరాలు బాత్రూంలో స్నానం చేస్తుండగా, సెల్‌ఫోనులో రికార్డు చేశాడు. దీన్ని గమనించిన ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్నవారు భాస్కరరావును ప్రశ్నించి గట్టిగా కొట్టారు. రాత్రి ఇంట్లో పెట్టి తాళం వేయడంతోపాటు ఉదయాన్నే అల్పాహారమిచ్చి మరోమారు చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన భాస్కరరావు ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యువకుడి మరణానికి ఇంట్లో ఉన్నవారే కారణంగా భావించి, బిఎన్ఎస్ 108 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె హోటల్ మలుపు వద్ద బైక్ బోల్తా పడిన ఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి సిఐ సుధాకర్ కథనం ప్రకారం..భీమిలి మండలం, చిప్పాడ దివీస్‌లో పని చేస్తున్న విజయనగరం జిల్లా, ఎల్ కోట మండలం,కొట్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్ (25), అతని స్నేహితుడు లోకేష్ మోటారు బైక్‌పై విశాఖ నుంచి బీచ్ రోడ్డు మీదుగా భీమిలి వైపు అతివేగంగా వస్తున్నారు.ప్రదీప్ డ్రైవ్ చేస్తున్నాడు.ఈ క్రమంలో స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె.హోటల్ వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ప్రదీప్, లోకేష్‌లను స్థానికులు 108 లో కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించగా, తీవ్రగాయాలతో లోకేష్ చికిత్స పొందుతున్నాడు. మృతుని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మేహాద్రి రిజర్వాయర్‌లో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెందుర్తి : మేహాద్రి రిజర్వాయర్‌లో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెందుర్తి సిఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. నాతయ్యపాలేనికి చెందిన వి శివరాం(28) మనసు బాగోలేదని మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు వచ్చాడని, అక్కడ నుంచి తన చిన్నాన్నకు ఫోను చేసి, తాను డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన మృతుని చిన్నాన్న వెంటనే శివరాం అన్నయ్యకు ఫోనుచేసి సమాచారమిచ్చాడు. పోలీసులకు సమాచారమిచ్చిన శివరాం అన్నయ్య, మేహాద్రి రిజర్వాయర్ వద్దకు వెళ్లాడు. గజ ఈతగాళ్ల సాయంతో డ్యాంలో గాలించగా శివరాం మృతదేహం లభ్యమైంది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కాగా ఇటీవల మూడు పెళ్లిసంబంధాలు చూసినప్పటికీ, అవి ఫెయిల్ కావడంతో మనస్తాపంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల విశాఖ నగరంలో వెలుగు చూసిన క్రికెట్ బెట్టింగ్ ముఠాకు సంబంధించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ కమిషనరేట్ పరిధిలోని సిటీ టాస్క్ ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా పెద్ద వాల్తేరు డాక్టర్స్ కాలనీ గాయత్రి టవర్స్‌లో ఒక ఇంటిపై దాడి జరిపి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని నుంచి ఒక ల్యాప్ టాప్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న 80 బ్యాంక్ అకౌంట్లను గుర్తించి వాటిలో ఉన్న రూ.45 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. ఈ అకౌంట్లను పరిశీలించగా రూ.178 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన బుకిని సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం విధితమే.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు 'విశాఖ' పాలిటెక్నిక్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ చైర్మన్

ప్రజాశక్తి- వేపగుంట : సౌత్‌జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు గోపాలపట్నం విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపికయ్యారని కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ తెలిపారు.కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన తమ కాలేజీ విద్యార్థులు ఎస్.సులోమణి, ఎన్.భాగ్యలక్ష్మి, ఎన్.దేవి సౌత్ జోన్‌కు ఎంపికయ్యారన్నారు. వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ, ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ జివి ప్రదీప్ వర్మ, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.ప్రసాద్.అభినందించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసాద్, పి.రాజకుమార్, సతీష్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్.కుశరాజు, ఎస్.రూపాలను కాలేజీ చైర్మన్ అభినందించారు.

నేడు బిసి రోడ్డులో పరస

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక నియోజకవర్గంలోనే అతిపెద్ద ప్రాముఖ్యత కలిగిన సీతారామ ఉమా రామలింగేశ్వర పరసఈనెల 2న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కొత్త గాజువాక నుంచి బిసి రోడ్డు ఏనుగు బొమ్మ వరకు భారీ ఎత్తున లైటింగు, 14 స్టేజి ప్రోగ్రాములు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గాజువాకతోపాటు నగరంలోనూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు ఈ పరసకు ఏటా తరలివస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇతర స్టేషన్ల నుంచి అదనపు సిబ్బందిని రప్పించి భద్రత కల్పిస్తున్నారు.

ఆదిత్యుని భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - అరిలోవ : రథసప్తమి సందర్భంగా ఈనెల 3వతేదీ సోమవారం మధ్యాహ్నం నుంచి 5వ తేదీ బుధవారం వరకు రెండురోజులపాటు అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం ప్రసాదం, అన్నదానం చేపడుతున్నట్లు ఉపకార్ ట్రస్ట్ చైర్మన్, ఎపి ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు, సినీ నిర్మాత, డాక్టర్.కంచర్ల అచ్యుతరావు అన్నారు. శ్రీకాకుళం చాత్తాద వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పాలు, టీ, కాఫీ, ఉప్మా, చక్రపొంగలి, మజ్జిగ, పులిహోరా, మంచినీరుతోపాటు ప్రత్యేక కౌంటర్ల వద్ద అన్నప్రసాద వితరణ చేపడతామన్నారు.దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామన్నారు. చాత్తాద వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో అందించే అన్నప్రసాదాలను ఆదిత్యుని దర్శనికి వచ్చే భక్తులు స్వీకరించాలని కంచర్ల అచ్యుతరావు కోరారు.

కల్పనా చావ్లాకు ఘన నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారతీయ మహిళ కల్పనా చావ్లా వర్ధంతిని శని వారం భీమిలి మండలం, సింగన బంద పంచాయితీ, కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో నిర్వహించారు. కల్పనాచావ్లా అద్వితీయమైన అంతరిక్షయానాన్ని గురించి విద్యార్థులకు హెచ్ఎం జి.సత్యనారాయణ వివరించారు

భక్తులకు ఆహార పదార్థాల పంపిణీ

ప్రజాశక్తి- వేపగుంట : జ్ఞానాపురం జంక్షన్ నుంచి కొత్తవలస వ్యాకులమాత పుణ్యక్షేత్రానికి కాలినడకన దర్శనానికి వెళ్లే భక్తులకు పైడికొండల కనకరాజు, జ్యోతి దంపతులు సమకూర్చిన ఆహార పదార్థాలను గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందజేశారు. ఏటా వ్యాకులమాత దర్శనానికి వెళ్లే భక్తులకు క్రమం తప్పకుండా ఆహారపదార్థాలను వితరణ చేసిన కనకరాజు, జ్యోతి దంపతులను అభినందించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

జ్యోతి ప్రజ్వలనతో ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

- భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది వేడుక
- ఆకట్టుకున్న నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- పైలాన్, సావనీర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల స్థాపించి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రెండ్రోజుల పాటు జరుగనున్న శతాబ్ది ఉత్సవాలు శనివారం సాయంత్రం ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. వందేళ్ల ఉత్సవాలకు గుర్తుగా నిర్మించిన పైలాన్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులను, ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి సివిల్స్, ఇతరత్రా ఉన్నతోద్యోగాలలో స్థిరపడి ఉత్సవాలకు హాజరైన పూర్వ విద్యార్థులను ఎమ్మెల్యే గంటా జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గంటాను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కూచిపూడి నృత్యం, మహిళా కోలాట ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఉత్సవంలో విద్యార్థుల ఆటాపాటా

పెన్షనర్ల సమస్యలపై దశలవారీ ఆందోళన

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : పెన్షనర్ల సమస్యలపై దశల వారీ ఆందోళన చేయనున్నట్లు చిట్టివలస ప్రాంత ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు దామోదర బాబాజీ, అప్పారావు ,సహాయ కార్యదర్శి ఎం అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్య నారాయణ స్పష్టం చేశారు. శనివారం స్థానిక జిఆర్ భవన్‌లో సంఘ సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పింఛను మొత్తాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు . పింఛనుదారుల సమస్యలపై ఆ నెల 11, 12, 13 తేదీల్లో ఢిల్లీలో, 11,12 తేదీల్లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. 11న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. సంఘం నాయకులు కె రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

బాజినాయుడుకు ఘనసత్కారం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : వైసిపి జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులుగా మరోమారు నియమితులైన ఎం.ఎ. ప్రసాద్ (బాజీ నాయుడు)ను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ అధ్యక్షతన శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమములో రాష్ట్ర కార్యదర్శి వోడా శ్రీనివాసరావు, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శులు, విశాఖపట్నం జిల్లా, నియోజకవర్గస్థాయి లీగల సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాజీ నాయుడు మాట్లాడుతూ, తనకు మరోసారి అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, పార్టీ లీగల్‌సెల్ రాష్ట్రఅధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

90 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి- ఆనందపురం : సురేష్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఆనందపురం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సురేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ క్లినిక్ ఎండి డాక్టర్ జి సురేష్ రెడ్డి, డాక్టర్ అపర్ణ రెడ్డి ఆధ్వర్యంలో 90 మంది రోగులకు బిపి, ఇసిజి, ఆర్ఎఫ్‌టి, బ్లడ్ సుగర్, మూత్రం, హిమోగ్లోబిన్ వంటి పలు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయిబాబా పవన్ డెంటల్ డాక్టర్ శ్రీదివ్య తదితరులు పాల్గొన్నారు.

గీతం ఆధ్వర్యాన సిఆర్ఆర్‌సిలు

ప్రజాశక్తి- మధురవాడ : ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, విపత్కర పరిస్థితులలో మానసిక ఆందోళనకు గురి కాకుండా వ్యవహరించాల్సిన పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్ఆర్‌సి)లను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలలో ఏర్పాటు చేసినట్లు గీతం ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం గడబూరు, కోనం, కుడెంపూడి గ్రామాలలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 850 మంది గిరిజనులకు వైద్యసేవలు అందించారు. డిఎస్‌టి నిపుణులు డాక్టర్ కొంగ గోపికృష్ణ పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా సిఆర్ఆర్‌సిలను ఏర్పాటుచేసి, స్థానికులకు వైద్యసేవలతోపాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న గోపీకృష్ణ

గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ మాట్లాడుతూ, గిరిజన గ్రామాలలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం పట్ల అవగాహనకు, ఉచిత వైద్యసేవలకు ఆరోహన్ ట్రైబల్ సొసైటి, కృషి విజ్ఞాన కేంద్ర, రోటరీ విశాఖ పెరల్ సిటి సంయుక్తంగా జిమ్‌సర్ ఆసుపత్రి వైద్యులతో కలిసి పనిచేస్తోందన్నారు. వైద్య శిబిరం నిర్వహణకు జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి సహకరించారు.

పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట

భారీ స్థాయిలో వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు ఎస్‌బిఐ ఎదురుగా తాటిపూడి తాగునీటి పైపులైన్ లీకేజీకి సంబంధిత జివిఎంసి అధికారులు ఎట్టకేలకు అడ్డుకట్ట వేశారు. పైపులైన్ లీకేజీతో భారీగా నీరు వృథాగా కావడంతో ఈ ప్రాంతంతా జలమయమై, శనివారం కొత్తవలస వ్యాకులమాత పండగకు కాలినడకన వెళుతున్న భక్తులతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి జివిఎంసి అధికారులు అప్రమత్తమై పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట వేసి, తాగునీటి వృథాను అరికట్టారు. తరచూ ఈ ప్రాంతంలో తాటిపూడి పైపులైన్ లీకేజీతో తాగునీటి వృథాతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలను జివిఎంసి తాగునీటి విభాగం అధికారులు చేపట్టాలని కోరుతున్నారు.

వైసిపి నేత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు బంక రామసత్యం సతీమణి సూర్యనారాయణమ్మ పెద్దకర్మకు భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరయ్యారు. బంక రామసత్యాన్ని పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని నింపారు. మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, సర్పంచ్ గనిరెడ్డి శ్రీనివాసరావు, మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, మజ్జి వెంకటరావు, బోని అప్పల నాయుడు, పలువురు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -ఆనందపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు అన్నారు. శనివారం గుడిలోవ ఏక్యూజే కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనంతో యువత భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవడంతోపాటు ఎన్నో ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేయవద్దన్నారు. ఈ సందర్భంగా సిఐని ఘనంగా సన్మానించారు.కళాశాల డైరెక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ పిఒ పవన్ కుమార్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ కార్మికులకు మద్దతుగా నిలిచిన

సిఐటియు నాయకుల అరెస్టు సరికాదు

- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- సిఐటియు నేతలు శంకరరావు, గనిశెట్టి, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అచ్యుతాపురం ఎస్ఈజెడ్ బ్రాండిక్స్ అధిస్టాన్ 1, 3 యూనిట్ల సెక్షన్ల కార్మికులు తమ సమస్యలపై మూకుమ్మడిగా సమ్మెకు దిగిన నేపథ్యంలో వారికి మద్దతుగా వెళ్లిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పది, పదిహేను సంవత్సరాలుగా వేతనాలు పెరగకపోవడం, తీవ్ర పని ఒత్తిడి, పని గంటల పెంపు, మహిళలపై లైంగిక వేధింపులు, సౌకర్యాలు కోత, క్యాంటీన్‌లో నాసిరకం భోజనం వంటి సమస్యలపై కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం 2వ యూనిట్ కార్మికులు మెరుపు సమ్మె చేశారని, శనివారం ఒకటి, మూడు యూనిట్ల కార్మికులు మూకుమ్మడిగా విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారని పేర్కొన్నారు. వారిని యాజమాన్యం బయటికి రాకుండా గేట్లకు తాళాలు వేసి నిర్బంధించి వారిపై తీవ్ర దాడికి పూనుకోవడం దారుణమన్నారు. కార్మికులు పోరాటానికి మద్దతుగా వెళ్లిన సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ, పి.చలపతి, కె.సోమునాయుడులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. వేల కోట్ల రూపాయలు లాభాల ఆర్జిస్తున్న బ్రాండిక్స్ యాజమాన్యం కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. బ్రాండిక్స్‌లో మహిళా కార్మికులపై లైంగిక వేధింపులను అరికట్టడానికి ఎటువంటి కమిటీ లేదని, మహిళలకు రాత్రిపూట మగ సూపర్వైజర్లు ఫోన్లు చేసి అసభ్యంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం యాజమాన్యాల కొమ్ము కాస్తుందని, కార్మిక హక్కులను కాలరాస్తున్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్రాండిగ్స్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రాంబిల్లి : బ్రాండిక్స్ అధిస్తాన్ కార్మికులకు మద్దతుగా వెళ్లిన సిఐటియు నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. దేముడు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కారానికి యాజమాన్యం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్రాండిక్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

అనకాపల్లి : అచ్యుతాపురం ఎస్ఈజెడ్ అధిస్టాన్ జోన్‌లో ఉన్న బ్రాండెక్స్ మహిళా కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం అనకాపల్లి మండలం కన్వీనర్ గంటా శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమలలో అరగంట అదనంగా పనిచేయాలని యాజమాన్యం ఒత్తిడి చేయడాన్ని, కార్మికులకు మద్దతుగా నిలిచిన సిఐటియు నేతలను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

మాట్లాడుతున్న కెజిబివి రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

అభ్యసన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు తమ అభ్యసన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని కెజిబివి రాష్ట్ర కార్యదర్శి దేవానంద రెడ్డి సూచించారు. స్థానిక డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ అధ్యక్షతన కెజిబివి పాఠశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా విద్యాలయాల అవసరాలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన అభ్యసన ప్రక్రియల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. పరీక్షల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడుగునా ప్రత్యేక తరగతులు పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని పోగొట్టాలని సూచించారు. విద్యార్థుల మానసిక వికాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రానున్న రెండు నెలల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు పదో తరగతి పాఠ్యాంశాలపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ద్వారా బోధన నివిజయగాథలను వివరించాలని సూచించారు.

తెగుళ్లకు మందులు పిచికారీ చేయాలి

ప్రజాశక్తి-యలమంచిలి : అపరాల పంటలకు సోకిన తెగుళ్లకు మందులు పిచికారీ చేయాలని అనకాపల్లి ప్రాంతాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ఎస్ రామలక్ష్మి, యలమంచిలి వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త ఎంఎస్.కుమారి అన్నారు. మండలంలోని పులపర్తి, కృష్ణాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన శనివారం జరిగింది. మండల వ్యవసాయాధికారి మోహనరావుతో కలిసి వారు అపరాల సాగును సందర్శించారు. అపరాలు, మొక్కజొన్న, రాగి పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, అపరాలపై బూడిద తెగులు, మారుకామచ్చల పురుగు ఆశించిందని తెలిపారు. పల్లాకు తెగులు సోకిన మొక్కల్ని పీకి పారేయాలని, తామర పురుగు నివారణకు మందులు పిచికారీ చేయాలని చెప్పారు. పూతమీద ఉన్న అపరాలకు కాయ గట్టి పడడానికి పొటాషియం నైట్రేటు లీటరుకు 10గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి అరుణ, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వ జిల్లా, ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాలు వంటి ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని ఏపి కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం కార్మికులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కూడా కాంట్రాక్టర్లు తినేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వాయిబోయిన శేఖర్, నాగ రత్నం, అరుణకుమారి, బి.లక్ష్మి, సత్యవతి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, ఈశ్వరమ్మ సూకరత్నం పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : హైదరాబాదులో ఫిబ్రవరి 7వ తేదీన జరుగు లక్ష డప్పులు, వేల గొంతులు అనే సాంస్కృతిక కార్యక్రమం గోడ పత్రికలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు చేతుల మీదుగా శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత హైదరాబాదులో జరగబోవు లక్ష డప్పులు... వేల గొంతులు కార్యక్రమానికి మన అనకాపల్లి జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల నుండి మాదిగలు, రెల్లి, ఉప కులాల సోదరులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు, నాయకులు కొల్లి చిన్న అప్పారావు, కట్టమూరు మంగరాజు, కాకినాడ కనకేశ్వరరావు, గంపల చినరాజు, ఐవిఆర్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఘనంగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, మల్ల సంజీవరావు, దాడి అప్పలనాయుడు, పెంటకోట శ్రీరామమూర్తి, సూరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన రామకృష్ణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మాదిగ కార్పొరేషన్ చైర్పర్సన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సస్పెండ్ అయిన జడ్జి రామకృష్ణపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల మహిళా అధ్యక్షురాలు గొట్టివాడ సుభాషిని డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. గౌరవ హోదాలో ఉన్న మహిళపై జిల్లా న్యాయమూర్తిగా పనిచేసి వ్యక్తి సభ్య సమాజం తలదించుకునే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-పరవాడ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును జనసేన పార్టీ మండల ఇన్చార్జ్ పంచకర్ల ప్రసాద్ బాధితునికి శనివారం ఉదయం అందజేశారు. పరవాడ గ్రామానికి చెందిన సబ్బవరపు పైడం నాయుడు అనారోగ్యం బారిన పడడంతో వైద్యానికి అధిక మొత్తం ఖర్చయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహకారం అందజేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును అభ్యర్థించారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.3,60,000 చెక్కు మంజూరైంది. ఈ చెక్కును పైడం నాయుడు దంపతులకు అందజేశారు. ఈ మేరకు తన క్లాస్‌మేట్ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు, పైలా రాము, ఎమ్మెల్యే పంచకర్ల, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు తదితరులకు, సహచర పూర్వ విద్యార్థులకు పైడం నాయుడు దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న దృశ్యం

కూరగాయల సాగు పెంచాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

రైతులు పండించిన క్యాబేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-కె.కోటపాడు

జిల్లాలో వెజిటబుల్ క్లస్టర్లుగా గుర్తించిన గ్రామాల్లో కూరగాయల పెంపకం విస్తృతంగా పండించాలని, మిగిలిన గ్రామాల్లో కూడా వివిధ రకాల పూలు, పండ్లు, కూరగాయలు ఆధునిక సాగు పద్ధతుల ద్వారా రైతులు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శనివారం తెల్లవారుజామున మండలంలోని గొండుపాలెం, కె.సంతపాలెం గ్రామాలను ఆమె సందర్శించారు. గొండుపాలెంలో పలువురకు పెన్షన్లను అందజేశారు. అనంతరం జిల్లాలోనే అత్యధిక కూరగాయలు పండించే కె.సంతపాలెంలో జిల్లా, మండల స్థాయి అధికారులను వెంటబెట్టుకుని పొలంబాట పట్టారు. అక్కడ పండిస్తున్న వివిధ రకాల కూరగాయ వంటలను పరిశీలించారు. ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న క్యాబేజీ పంటను చూసి రైతులంతా ఒకే రకమైన పంటను కాకుండా రకరకాల కూరగాయలను పండిస్తే మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. సీజన్‌కు అనుగుణంగా మంచి మేలైన విత్తనాలు అందించి సేంద్రీయ పద్ధతిలో సాగు చేసేటట్లు రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావును ఆదేశించారు. విదేశీ పంటలైన బ్రోకోలీ, జుకిని వంటి కూరగాయలను పండిస్తుండటంపై జిల్లా కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. పంట పండించే దగ్గర నుండి మార్కెట్‌కి వెళ్లే వరకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగారు. ప్రతి ఇంటికి రైతు బజార్ కార్డులు అందించాలని, దీని వల్ల నేరుగా మార్కెట్లో అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని రైతులు తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్డిఏ పిడి శచీదేవి, మండల ప్రత్యేక అధికారి పూర్ణమదేవి, ఎంపీడీవో సాంబశివరావు, డిప్యూటీ తహశీల్దార్ రమేష్ బాబు, హార్టికల్చర్ అధికారి కిరణ్మయి, స్థానిక సర్పంచ్ చల్లా మంగ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

జీడి, మామిడి పూత దెబ్బతింటుందని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి పట్టణాన్ని శనివారం పొగమంచు కప్పేసింది. క్రమంగా చలి తగ్గుముఖం పడుతున్నా పొగ మంచు ముసుగులో రహదార్లు మూసుకుపోయాయి. జాతీయ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ దట్టమైన పొగమంచుతో నిండిపోయాయి. దాంతో వాహనాలు దగ్గరగా వస్తే తప్ప కనిపించని పరిస్థితి ఎదురైంది. యలమంచిలి వీధిరోడ్లలో హైడ్‌లైట్లు వేసుకొనే వాహనాలు ప్రయాణించాయి. కార్లు, ద్విచక్ర వాహనదారులంతా 9 గంటల వరకూ లైట్లు వేసుకొనే వాహనాలు నడిపారు. స్కూలు, కాలేజీలు వెళ్లే ద్విచక్రవాహనాలు, ఆటోలు చాలా నెమ్మదిగా నడిచాయి. పొగమంచు మూలంగా మామిడి, జీడి మామిడి పూత దెబ్బతింటుందని వ్యవసాధికార్లు చెబుతున్నారు. ఎక్కువ రోజులు పొగమంచు కురిస్తే పూత దెబ్బతిని మామిడి దిగుబడి దెబ్బతింటుందని మామిడి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. పొగమంచు ఎక్కువగా ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిదని, తప్పని పరిస్థితి ఎదురైతే చాలా నెమ్మదిగా వెళుతూ, హైబీమ్‌లైట్లు వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనదారులు

కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నేత రాంకీ

సూర్యనారాయణమూర్తి ఆలయ కొత్త మెట్లు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెంలో శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో కొత్త మెట్లను రథసప్తమి నేపథ్యంలో అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయ కమిటీ సభ్యులు జనసేన నాయకులు రామకృష్ణ, ప్రముఖ సామాజిక సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దూలం గోపి, గొల్ల బాబు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్వారీ డ్రిల్లింగ్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి : క్వారీ డ్రిల్లింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వీటిపై ఆర్డీవో, స్థానిక శాసనసభ్యులు యజమానులతో చర్చించాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. దీనికి ముందు అనకాపల్లి గుండాల జంక్షన్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా, కోన మోహన్ రావు, క్వారీ కార్మిక సంఘం నాయకులు జి.సూర్యారావు, ఎస్ సూరిబాబు, సిహెచ్ రమేష్, సిహెచ్ చిన్నారావు, సిహెచ్ గంగరాజు, బౌలువాడ, మామిడిపాలెం, మాకవరం, మార్టూరు, ఊడేరు గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

6న టిడిపి సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు ఈనెల 6న జరుగుతాయని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు తెలిపారు. 2024 నవంబరు నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలుపెట్టి జనవరి 19వ తేదీతో ముగించినట్లు చెప్పారు. మొత్తం సభ్యతాలలో 45 శాతం మహిళలు తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకోవడం శుభ పరిణామని పేర్కొన్నారు. ప్రతి 60 కుటుంబాలకు పార్టీ తరపున సాధికార సారధిని నియమించాలని, కుటుంబ సాధికార సారధులు యూత్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలను ఫిబ్రవరి 6న ప్రారంభిస్తారని వెంకటరావు తెలిపారు.

డ్రైనేజీలపై పలకలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో పంచాయతీలో మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థపదార్థాలను గ్రామపంచాయతీ సర్పంచ్ చేపల సుహాసిని రమణ ఆధ్వర్యంలో శనివారం పరిశుభ్రపరిచారు. కాలువలలో చెత్తాచెదారం పడుకుంటా, దుర్గంధం వెదజల్లకుండా ప్రధాన కాలువలపై సిమెంటు పలకలను అమర్చారు.

కాపులుప్పాడకు చెత్త తరలింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన వ్యర్థపదార్థాలను, చెత్తను భీమిలి నియోజకవర్గం కాపులొప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించడానికి శనివారం జిల్లా పంచాయతీ అధికారి పి శిరీష పర్యవేక్షణలో పనులు చేపట్టారు. గ్రామ పరిసరాలలో పేరుకుపోయిన వ్యర్థపదార్థాలను గ్రామ సర్పంచ్ డి నాయుడు బాబు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆమె విచ్చేసి గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను జెసిబి సహాయంతో లారీలకు లోడింగ్ చేయించి కాపు లొప్పాడకు తరలించారు. ఈఓపిఆర్డి శ్రీరామనాయుడు పాల్గొన్నారు.

'అయ్యన్న మాటలపై రాద్ధాంతం సరికాదు'

ప్రజాశక్తి-దేవరాపల్లి : 1/70 చట్టాన్ని సవరించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాద్ధాంతం చేయడం సరికాదని శ్రీరామ రైతు సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కెవి.రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చట్టం వలన గిరిజనులకే ఎక్కువ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన ఉద్యోగులకు బ్యాంకులు, హౌసింగ్ రుణాలను ఇవ్వడం లేదని, వాళ్ళ ఆర్థిక అవసరాలకు భూములు అమ్ముదామన్నా కొనేవారు లేరని, దీంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని పేర్కొన్నారు.

పెదనాయుడు చెరువును పరిరక్షించాలి

రాయపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల అడ్డగించిన రైతులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన పెద నాయుడు చెరువును పరిరక్షించాలని ఆయుకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయపూర్ -విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను శనివారం మళ్ళీ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చెరువు గర్భంలో హైవే కాంట్రాక్టర్లు వేసిన సామగ్రిని జెసిపితో పక్కకి చేరవేశారు. ఈ సందర్భంగా ఆయుకట్టు రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 109లో పెదనాయుడు చెరువు 15.30 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, ఈ చెరువు ద్వారా పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం, తవ్వవానిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 96 ఎకరాల ఆయుకట్టు పంట పొలాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జాతీయ రహదారి అధికారులు అక్రమంగా చెరువు గర్భం కప్పివేసి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నెంబర్ 64లో 3.81 ఎకరాల గెడ్డ వాగును కూడా ఆక్రమించారన్నారు. తక్షణమే అధికారులు ఈ పనులపై సమగ్రత దర్యాప్తు చేసి చెరువు గర్భాన్ని, గెడ్డవాగును పరిరక్షించాలని కోరారు. ఇరిగేషన్ ఏఈ సాయి కిరణ్ స్పందిస్తూ తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకూ పనులను అడ్డగిస్తామని, దీక్షలు కూడా చేపడతామని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కోటాన అప్పారావు, గొర్లి అచ్చం నాయుడు, వెన్నల సన్నిబాబు, సబ్బవరపు సత్యనారాయణ, శ్రీను, సబ్బవరపు నాగభూషణం, శివ, కొండబాబు, గోపాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న రైతులు

సుజల స్రవంతి కాలువకు భూసేకరణ పూర్తి

మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి

ప్రజాశక్తి-సబ్బవరం : బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి జిల్లాలో అనకాపల్లి, సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లోని 22 గ్రామాలలో భూ సేకరణ చేసినట్లు సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొయ్య రమామణి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సుజల స్రవంతి కాలవ నిర్మాణానికి జిల్లాలో 1850 ఎకరాలు భూమిని సేకరించినట్లు చెప్పారు. అనకాపల్లి మండలంలో 10 గ్రామాలు, సబ్బవరంలో తొమ్మిది గ్రామాలు, కె.కోటపాడు మండలంలో మూడు గ్రామాలు కలిసి 22 గ్రామాలలో జరాయితీ 1200 ఎకరాలు, ప్రభుత్వ భూమి 650 ఎకరాలు సేకరణ చేసినట్లు వెల్లడించారు. వంగలిలో రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదని, ఆ గ్రామానికి చెందిన 45 ఎకరాల భూమిని ఇంకా సేకరించవలసి ఉందని పేర్కొన్నారు. రైతులకు పరిహారం కింద సుమారు రూ.1000 కోట్ల వరకు ఇప్పించవలసి ఉందన్నారు. 2022లో ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌కు ఈ ఏడాది తర్వాత గడువు ముగిసిందని, దీనికోసం మళ్లీ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలు సేకరించి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత రైతులకు పరిహారం చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో స్థానిక తహశీల్దార్ బి.చిన్నకృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ పిన్నింటి రమణ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా రమామణి

మండల ప్రత్యేకాధికారిగా రమామణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దారు బి.చిన్నకష్ణ, సిఐ పిన్నింటి రమణతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుక, ప్రధానమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా తులసీరావు 86వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - యలమంచిలి

విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ కీర్తిశేషులు ఆడారి తులసీరావు 86వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వారి పొలంలో ఏర్పాటు చేసిన 'తులసీఘాట్'లో కుటుంబ సభ్యులంతా నివాళులర్పించారు. జిల్లా నలుమూలల నుండి తులసీరావు అభిమానులు, శిష్యులు, విశాఖ డెయిరీ డైరెక్టర్లు, పాల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వారికి మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని తులసీరావు భార్య జయమ్మ ప్రారంభించారు. తులసీరావు కాంస్య విగ్రహం ప్రాంగణంలో జానపద కోలాటాలు, తప్పెటగుళ్ళ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, రామకృష్ణ కుటుంబ సభ్యులతో పాటు



రాజకీయ ప్రముఖులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎంపిపి బోదెపు గోవిందరావు, బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కూటమి నాయకులు వైస్ ఎంపిపి రాజాన శేషగిరిరావు, మళ్ల కన్నారావు, యల్లపు నాగరాజు, ఆడారి వెంకట్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) నిలుపుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి, 27వ తేదీన ఎన్నికలు, మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీన ముగుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. జిల్లాలో శాసన మండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయంలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ ఎస్) నిలుపుదల చేయడం జరిగిందని, దీనిని ప్రజలు గమనించవలసినదిగా విజ్ఞప్తి చేశారు·

దగ్ధమవుతున్న గడ్డి వాము

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో ఆడారి గణేష్‌కు చెందిన గడ్డివాము శనివారం పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన స్థానికులు ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేసేందుకు విఫల ప్రయత్నం చేశారు. విద్యుత్ సర్వీసు వైర్లు చెట్టుకొమ్మలకు తగలడంతో నిప్పురవ్వలు గడ్డి వాముపై పడి ఈ ప్రమాదం సంభవించినట్లు రైతు గణేష్ తెలిపారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెట్లు కొమ్మలు నరకాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని బాధిత రైతు గణేష్ తెలిపాడు.

చీరలు, దుస్తుల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : భక్త మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా శనివారం స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో చినరాజుపేట శ్రీచౌడేశ్వరి శ్రీసాంభశివుని దేవాలయం ప్రాంగణంలో ఉన్న లయోలా అనాథ వృద్ధుల శరణాలయానికి చీరలు, దుస్తులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యకర్తలు కె.ప్రశాంత్, ఎస్.సాయివర్ధన్, అసోసియేషన్ ప్రతినిధులు పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, ఉజ్జి సత్యనారాయణ, అలంక బెన్నయ్య, రేబాక వరం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- పాయకరావు బోనంగిలో తొలగించని ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-పరవాడ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా మండలంలో కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కాగా మార్చి 21 వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉంటుందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అయితే తెలుగుదేశం, జనసేన పార్టీల ఫ్లెక్సీలు మండలంలోని పాయకరావు బోనంగి గ్రామంలో యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ వారికి వర్తించదా? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

పాయకరావు బోనంగిలో తొలగించని అధికార పార్టీ ఫ్లెక్సీ

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి -కొత్తకోట:తమ వీధి లో గత కొన్ని నెలలుగా తాగునీటి సరఫరా కావేదని రావికమతం మండలం కొత్తకోట అంబేద్కర్ కాలనీ మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గత ఆరు నెలల కిందట జల జీవన్ పథకం లో వేసిన ఇంటింటికి కొళాయిలు అలంకార ప్రాయంగా ఉన్నాయని, వాటి నుంచి చుక్క నీరు కూడా రావేదని కాలనీ మహిళలు రెడ్డి మాలదేవి, చిక్కాలరాజు, పూడి సత్యవతి, రెడ్డి మాలరాజు తదితరులు వాపోయారు..దీంతో తాగు నీటి కోసం బిందెలతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకూ చలి కాలం కావడంతో సర్దుకు పోయామని, ఇక పై తాగునీటికి ఇబ్బందులు పడాల్సి ఉందన్నారు. ఈ సమస్య పై పంచాయితీ పాలకులకు పలుమార్లు అభ్యర్ధించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా తాగునీటి సరఫరా కు చర్యలు చేపట్టాలని, లేదంటే పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని పలువురు మహిళలు హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న మహిళలు



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- మాడుగుల:అనకాపల్లి జిల్లా, ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూర్టీ, పేస్ట్ కంట్రోల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి తక్కువ వేతనం ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ కూడా కాంట్రాక్టర్లు చెల్లించలేదన్నారు. .దీనిపై కార్మిక శాఖఅధికారులకు ఎన్నిసార్లు వినవించు కున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వాయిబోయిన శేఖర్, కార్మికులు పెంటారావు, తాతారావు, కనకం, యల్లమ్మ, చిత్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.

గరుడాద్రి పర్వతంపై కమ్ముకున్న పొగ మంచు

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురవడంతో ముఖ్యంగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు వాహనాలకు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. మంచు ప్రభావంతో ముందు వెళ్లే వాహనాలు సరిగ్గా కనిపించక పోవడంతో వాహనదారులు డ్రైవింగ్ చేసేందుకు అవస్థలు పడ్డారు. ఉపమాక వెంకన్న గరుడాద్రి పర్వతంపై దట్టమైన పొగ మంచు కమ్మడంతో భక్తులు ప్రకృతి అందాన్ని ఆస్వాదించారు. గత కొన్ని రోజుల నుండి విపరీతంగా కురవడంతో జీడి, మామిడి పూత దెబ్బతిని, నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మాడుగుల:మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.కోటపాడు గ్రామంలో గుమ్మాల మోహన్‌రావు (48) మద్యానికి బానిసై ప్రతిరోజు పూటుగా మద్యం సేవిస్తున్నాడు. మద్యాన్ని సేవించవద్దని కుటుంబ సభ్యులు పదే పదే చెప్పేవారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మృతుడు భార్య వరలక్ష్మి హైదరాబాదులో ఉంటున్న తన పిల్లల వద్దకు వెళ్లింది. భార్య కూడా లేకపోవడంతో మద్యం పూటుగా సేవించి చనిపోయాడని పరిసర ప్రాంతాల ప్రజలు పేర్కొన్నారు.మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై నారాయణరావు వద్ద ప్రస్తావించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ముగిసిన జాతీయ సాంకేతిక సమావేశాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మాకవరపాలెం మండలంలో అవంతి కళాశాల ఆవరణలో జరిగిన జాతీయ సాంకేతిక సమావేశం శనివారంతో ముగిసింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సహా వివిధ సంస్థలకు చెందిన జేఎన్టీయూ, ఐఐటి, ఎన్ఐటి, ఈ ఈఈ, ప్రముఖులు హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు భవిష్యత్తుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఈ నాలుగు సంవత్సరాలలో తీసుకున్న జాగ్రత్తలే భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో అంకితభావంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. అనంతరం ప్రముఖులను చైర్మన్ శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డానియల్ రాజు, కళాశాల సిబ్బంది పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అవంతి

జంతువుల సంరక్షణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న చిట్టినాయుడు

ప్రజాశక్తి-చీడికాడ:మానవజాతి మనుగడలో కీలక పాత్ర వహిస్తున్న జంతువుల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. తురువోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎండాకాలంలో పశు పక్ష్యాదులు నీళ్ళు లేక, తిండి లేక ఇబ్బంది పడేటటువంటి అవకాశం ఉంటుందని, కనుక ఇంటి పరిసరాల్లో అవసరమైన నీటి గుంటలు ఏర్పాటు చేయాలన్నారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాధి టీకాలు వేయించాలన్నారు. జంతువులను ఎవరైనా హింసించినా కఠినమైన చట్టాలు ఉన్నాయని చెప్పారు. దేవాలయాలు, వీధుల వంటి ప్రదేశాలలో జంతువులను వధించడం చట్ట విరుద్ధం, గాయ పరచడం నిషేధమన్నారు. . ఈ కార్యక్రమంలో పెదగోగాడ పశు వైద్యాధికారి రాఘవమ్మ, హెడ్ మాస్టర్ రామక్రిష్ణ, పశు వైద్య సహాయకులు రాజేష్ పాల్గొన్నారు.

భారీ యంత్రాన్ని తీసుకెళ్తున్న కంటైనర్

భారీ వాహనంతో ఇక్కట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని జాతీయ రహదారిపై భారీ యంత్రాన్ని లారీపై తీసుకు వెళ్లడంతో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. కాకినాడ నుండి ఒరిస్సా ప్రాంతానికి భారీ యంత్రాన్ని లారీపై తరలిస్తున్నారు. రోజుకు 20 కిలోమీటర్ల మేర మాత్రమే ప్రయాణం సాగిస్తున్నారు. శనివారం వేంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాన్ని నిలుపుదల చేశారు. ఈ వాహనం వెళ్లేటప్పుడు మిగిలిన వాహనాలు రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొత్తకోటలో సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి-కొత్తకోట:ఆకతాయిల చర్యలతో సుమారు రెండు లక్షల విలువైన సరుగుడు తోట అగ్నికి దగ్దమైన సంఘటన రావికమతం మండలం కొత్తకోట గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. సరుగుడు తోట మధ్యలో గుర్తు తెలియని ఆకతాయిలు మద్యంతో పాటు లిక్విడ్ గంజాయి సేవించి ఈ దురా ఘతానికి పాల్పడి ఉండ వచ్చునని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలో కొత్తకోట రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 174/5 లో రైతులు కలగర్ల రాధాకృష్ణ, రత్నప్రసాద్‌లకు చెందిన మూడు ఎకరాలు భూమి ఉంది. ఈ భూమి ని మర్రి వలస గ్రామానికి చెందిన మల్ల రమేష్ (కటా రమేష్) ఐదేళ్ల పాటు లీజుకు తీసుకోని ఉమ్మడి వ్యవసా యం చేస్తున్నారు. అందులో భాగంగా గత రెండేళ్ల కిందట మూడు లక్షల పెట్టుబడితో మూడు ఎకరాలలో సరుగుడు తోట వేశారు. మరో రెండేళ్ల లో పక్వానికి వచ్చే ఈ తోటలో సుమారు ఒక ఎకరా మేర సరుగుడు తోట శనివారం మధ్యా హ్నం 12 గంటల సమయంలో అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటనకు ముందు గుర్తు తెలియని యువకులు లిక్విడ్ గంజాయి, మద్యం సేవించిన ఆనవాళ్ళు ఉన్నాయి. దీనిపై కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కొత్తకోట ఎఎస్ఐ పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న లిక్విడ్ గంజాయి ఖాళీ సీసాలను సేకరించారు.

దగ్ధమైన సరుగుడు తోట

విచారణ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

భూ సమస్యలపై విచారణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండల పరిషత్ కార్యాల యంలో శనివారం మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆర్.నరసింహమూర్తి, ఎంపీడీవో డి.సీతారామ రాజు, ఎస్ఐ సన్నిబాబులతో కలిసి మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. అదేవిధంగా పలు గ్రామాల నుండి వచ్చిన భూ సమస్యల ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

లలితకు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.లలిత ఈనెల 26న విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి పురస్కారం అందుకుంది. ఈ మేరకు శనివారం ప్రిన్సిపల్ సువర్ణ కుమారి, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థి ఎం.లలితను అభినందించారు.రాష్ట్రంలో గల గురుకుల పాఠశాల నుండి ఒక్కొక్క బాలికను ఆ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాడానికి అవకాశం కల్పించారన్నారు. నక్కపల్లి నుండి తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.లలిత ఎంపికై గణతంత్ర వేడుకల్లో పాల్గొని మొదటిస్థానం లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సువర్ణ కుమారి వెల్లడించారు.

ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ప్రిన్సిపల్ సువర్ణకుమారి

రాష్ట్ర స్థాయి పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చింతపల్లి:రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లోని సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీటికి సంబంధించి పరిశోధనా స్థానం ఏడిఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యుడు ఆళ్ల అప్పలస్వామి అందించిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులు రెండు పతకాలు సాధించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వంతల అమృత సోలో సింగింగ్ కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించగా, గ్రూప్ డాన్స్ విభాగంలో విద్యార్థినిలు ప్రదర్శించిన దింసా నృత్యానికి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి దక్కినట్లు ఏడిఆర్ అప్పలస్వామి తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పాడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట:విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి రైతులను లూటీ చేస్తూ ఆవు పాల సేకరణ ధరలు తగ్గించిందని, తక్షణమై చర్యలు తీసుకోవాలని రోలుగుంట సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం రోలుగుంటలో ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణలో 10 శాతం తగ్గించారని, ఇంతకు ముందు నవంబర్‌లో సేకరణ ధర లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించడం జరిగిందన్నారు. ఇలా వరుస పెట్టి పాల రైతులను ఇబ్బందులు పెట్టి నష్టం కలిగిస్తూ నిండా ముంచుతున్నారని చెప్పారు. పెరిగిన పశు పోషణ ఖర్చుల భారం రైతు బరిస్తూ సెంటర్‌కు పాలు పోస్తున్నారన్నారు.రైతు శ్రమతో 1973లో డెయిరీ సహకార సంఘం ప్రారంభమైందని ఉత్తరాంధ్ర ఏడు జిల్లాల నుండి రైతులు విశాఖ డెయిరీకి పాలు పోస్తున్నారని చెప్పారు. డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి మార్చాలని ఆవు పాలు సేకరణపై పరిమితి ఎత్తి వేయాలని తగ్గిన ఆవు పాలు ధర పెంచాలని, సంవత్సరానికి మూడు పర్యాయవారాలు బోనస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక ధర లీటరుకు ఐదు రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.చిలుకు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిరంజీవి

లక్కబొమ్మలను తిలకిస్తున్న విద్యార్థులు

హైస్కూల్‌లో లక్క బొమ్మల ప్రదర్శన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి హైస్కూల్‌లో శనివారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అప్పన రాంబాబు ఆధ్వర్యంలో లక్క బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శెట్టి మోహన్‌రావు మాట్లాడుతూ, ఏటికొప్పాక బొమ్మలతో తయారు చేసిన ఆంధ్రప్రదేశ్ శకటానికి రిపబ్లిక్ డే సందర్భంగా మూడవ స్థానం వచ్చిందని చెప్పారు. ఈ బొమ్మలను అంకుడు కర్రతో, సహజ సిద్ధమైన రంగులతో తయారు చేస్తారని, ఇది అంతర్జాతీయంగా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం, బి.విద్యావతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: మండల కేంద్రంలో కూరల వ్యాపారం చేసుకుంటున్న మళ్ల జగన్నాథ రావు (జగ్గు) గుండెపోటుతో మృతి చెందాడు. తన ఏకైక కుమార్తె నిహారిక కు విషయం తెలియగానే హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆమె గ్రామానికి వచ్చింది. తండ్రి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. శనివారం తండ్రి మృతదేహానికి అన్నీ తానై తలకొరివి పెట్టింది.

రూ.10వేల పింఛను అందజేత

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని సూకూరు పంచాయతీ చట్రాయిపుట్టు గ్రామంలో సికిల్ సెల్ ఎనిమియా బాధితుడు గొల్లోరి కృష్ణకు నూతన పెన్షన్ రూ.10000 శనివారం స్థానిక సర్పంచ్ సత్యవతి చేతుల మీదుగా అందజేశారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌తో మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యం పట్ల తగు జాగ్రతలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధనసాని మురళి, పూర్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ కృష్ణ, ఆశ కార్యకర్త బృంద, వాలెంటీర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహా సభ దృశ్యాలు

చర్చలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

చర్చలో పాల్గొన్న విశాఖ జిల్లా ప్రతినిధులు

నెల్లూరులో మూడు రోజులపాటు తలపెట్టిన సిపిఎం రాష్ట్ర మహా సభ ఉత్సాహపూరిత వాతావరణంలో శనివారం ప్రారంభమైంది. కార్యదర్శి నివేదికపై పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రతినిధులు చర్చించారు. తొలిరోజు కార్యదర్శి నివేదికపై విశాఖ జిల్లా నుంచి ఆర్‌కెఎస్‌వి. కుమార్, బి.పద్మ మాట్లాడారు.

ఉక్కు రక్షణ దాత ముగింపు సందర్భంగా ఉద్యమ కాగడాను సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబీకి అందజేస్తున్న జాతా దళ నాయకులు యు.రామస్వామి తదితరులు

కార్యదర్శి నివేదికపై మాట్లాడుతున్న కుమార్ , పద్మ

కేంద్ర బడ్జెట్‌పై సిపిఐ నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు జరిగిన అన్యాయానికి నిరసనగా శనివారం సాయంత్రం సిపిఐ ఆధ్వర్యాన రైల్వేస్టేషన్ ఎదురుగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ. 50 లక్షలా 65 వేలా 345 కోట్ల బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరొకసారి గుండు సున్నా పెట్టారని, ఇది కేవలం అంకెల గారడీ బడ్జెట్ అని విమర్శించారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటన చేశారని, గత నెల 8వ తేదీన జోనల్ కార్యాలయం కోసం శంకుస్థాపన చేసినా నేటి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన సమయంలో చేసిన వాగ్దానాల అమలుకు నిధుల కేటాయింపు చేయకపోవడం మరోసారి రాష్ట్ర ప్రజానీకాన్ని వంచనకు గురిచేయడమేనని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన గానీ, సెయిల్ విలీనం ప్రకటన గానీ చెయ్యలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ సామాన్యులకు నష్టం చేస్తూ కార్పొరేట్ వర్గాలకు అనుకూలమైనదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లు కొనసాగించాలి

-జివిఎంసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో మున్సిపల్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 60 ఏళ్లకు కుదించడం సరికాదని, పాత పద్ధతిలోనే 62 ఏళ్లు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ, శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ, ఆప్కాస్ నుంచి ఇటువంటి ఆదేశాలు లేనప్పటికీ జివిఎంసిలో 60 సంవత్సరాలు నిండిన 210 మందిని నిలుపుదల చేశారని, శనివారం నుంచి మరి కొంతమందిని ఇదే కారణంతో నిలుపుదల చేయడం అన్యాయమని అన్నారు. జివిఎంసిలో పారిశుధ్యం, నీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగాలలో 7500 మందిని 62 సంవత్సరాల వరకు కొనసాగిస్తూ వచ్చారని చెప్పారు. దీనికి ఆప్కాస్ అభ్యంతరం చెప్పలేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు 58 సంవత్సరాలు ఉన్నప్పుడు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కూడా 58 సంవత్సరాలు అమలు చేశారని, 2022లో పర్మినెంట్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు రిటైర్మెంట్ విధానం అమల్లోకి వచ్చినప్పుడు, వీరికి కూడా దానిని అమలు చేస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ వయసు అన్నది ఎక్కడా నిర్ణయించలేదని, వారికి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు చెల్లించటం లేదని, ఈ కారణంగా వారసత్వంగా డెత్, రిటైర్మెంట్, లాంగ్ సిక్ ఆబ్సెంట్, అనారోగ్య కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తూ వస్తున్నారని తెలిపారు. 2009లో జివిఎంసి కౌన్సిల్ ఆదేశం ప్రకారం, పబ్లిక్ హెల్త్ కమిటీ వారు రిటైర్ అయిన వారి బిడ్డలకు ఉపాధి కల్పించుటకు అదే ఏడాది జనవరి 6న తీర్మానం చేశారని గుర్తు చేశారు.2017లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సమ్మె సందర్భంలో కూడా జెఎసితో డిఎంఎ సమక్షంలో జరిగిన ఒప్పందంలో కూడా ఇదే అంశం ఉందని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు 62 సంవత్సరాలు రిటైర్మెంట్ విధానాన్ని అమలు చేయాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ ప్రతినిధి వర్గం కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి వచ్చి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, జెఆర్.నాయుడు, శ్రీనివాసరావు, శ్రావణ్, జగ్గారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ఫీజు పోరు ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి ఫీజు పోరు ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు కరణం ధర్మశ్రీ, రమణికుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ మురళీకృష్ణ

బడ్జెట్‌ను స్వాగతించిన సిఐఐ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కేంద్ర బడ్జెట్ -2025 అన్ని రంగాలో భవిష్యత్తు భారతదేశం వృద్ధిని దష్టిలో పెట్టుకొని రూపొందించారని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రసంగం సందర్భంగా బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో సిఐఐ విశాఖపట్నం ఆధ్వర్యాన బడ్జెట్‌పై చర్చ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వి.మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ బడ్జెట్ వ్యవసాయం, ఎంఎస్ఎంఇలు, స్టార్టప్‌లు, హెల్త్ కేర్, మౌలిక సదుపాయాలను, బలోపేతం చేసే ప్రగతిశీల వృద్ధి ఆధారిత బడ్జెట్‌గా ఉందని చెప్పారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం మధ్య తరగతికి గణనీయమైన ఉపశమనం అని పేర్కొన్నారు. కేన్సర్, అరుదైన వ్యాధులతో సహా 36 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని మినహాయించడం వల్ల చికిత్స ఖర్చు తగ్గుతుందన్నారు. జిల్లా ఆసుపత్రులలో 200 డేకేర్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు ప్రధాన ఆసుపత్రులపై భారాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ చైర్మన్ నీరజ్ సర్దా, విశాఖపట్నం మాజీ చైర్మన్ జె.శ్రీనివాస్‌రాజు, విశాఖపట్నం ట్యాక్సేషన్ అండ్ ఫైనాన్స్ ప్యానెల్ కన్వీనర్ అనిల్ బెజవాడ, ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ప్యానల్ కన్వీనర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యక్తిని కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అనారోగ్య కారణంగా ఆర్‌కె.బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని జివిఎంసి లైఫ్ గార్డులు కాపాడారని జివిఎంసి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు శనివారం తెలిపారు. ఆర్‌కె.బీచ్ వద్ద మత్స్యదర్శిని సమీప బీచ్‌లో ఎన్ఎడి ప్రాంతానికి చెందిన నున్న చిట్టిబాబు (72) అనారోగ్య రీత్యా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డులు ఆనంద్, ధనరాజ్, అరవింద్, పోలిరాజు అతనిని కాపాడి సిపిఆర్ చేసి పోలీసుల సహాయంతో చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించినట్లు చెప్పారు.